క్లుప్తంగా

ప్రతి సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

పాలకొండ రూరల్: కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ పేరున సమస్యలపై వినతులు స్వీకరిస్తామని ఎంపీడీఓ ఎస్. రామకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలు తెలియజేసిన సమస్యలను పీజీఆర్ఎస్‌లో నమోదు చేసి ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని చెప్పారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

గరుగుబిల్లి: రెవెన్యూకు సంబంధించి పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని వీఆర్ఓలకు తహసీల్దార్ కె.జయ ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో వీఆర్ఓలతో సమావేశాన్ని నిర్వహించారు. రైతులకు సంబంధించిన భూముల మ్యుటేషన్లు, విద్యార్థులకు కుల, నివాస, ఆదాయ ధృవపత్రాలను సకాలంలో అందజేయాలని సూచించారు. సమావేశంలో డీటీ పీఎస్ లక్ష్మీకుమార్, ఆర్ఐ ఎం.కృష్ణ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టండి

- ఎంపీడీఓ కిశోర్‌కుమార్

భామిని: వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్న నేపథ్యంలో అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందని, గ్రామాల్లో త్వరితగతిన పారిశుధ్య పనులు చేపట్టాలని ఎంపీడీఓ పి. కిశోర్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. తక్షణమే గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు.

సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యం



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి ప్రభాకరరావు

గరుగుబిల్లి: ప్రజలకు సురక్షిత తాగునీటిని అందించడమే లక్ష్యమని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి, మండల ప్రత్యేకాధికారి ఒ.ప్రభాకరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వైద్యసిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాగునీరు, పారిశుద్ధ్యం, ప్రిజం -10 అమలు, తదితర అంశాలపై సమీక్షించారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులతో పాటు తాగునీటి బోర్లు, బావులను క్లోరినేషన్ చేయాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలిన గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అవసరమైన వైద్య సేవలందించాలన్నారు. వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ పి.సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

దిగువశెంబికి బీటీ రోడ్డు పూర్తి

- ఆనందంలో గిరిజనులు



నిర్మాణం పూర్తి చేసుకున్న బీటీ రోడ్డు

సాలూరు రూరల్: మండలంలోని దిగువశెంబి నుంచి డిప్పల పాడు మీదుగా తోణాం వెళ్లే రహదారి పనులను పంచాయతీ రాజ్‌శాఖ పూర్తి చేసింది. రూ.779 లక్షల అంచనా విలువతో ఈ ఏడాది జనవరిలో మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ఈ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇటీవల ఈ రోడ్డు పనులు దాదాపు పూర్తయ్యాయి. దశాబ్దాలుగా గిరిశిఖర గ్రామాలకు రోడ్డు లేక ఇబ్బందులు పడిన గిరిజనులు ఏకంగా బీటీ రోడ్డు నిర్మాణం కావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజల నుంచి 'స్పందన' కరువు

బొబ్బిలి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నిర్వహించిన ప్రజాస్పందన కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన కరువైంది. అధికారుల వైఫల్యమో లేక తమ సమస్యలపై ప్రభుత్వం నుంచి ఇప్పుడే స్పందన రాదేమోనన్న అనుమానమో కానీ సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపలేదు. తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా స్పందనకు అర్జీదారులు కానరాలేదు. దీనిపై ఆయా శాఖల అధికారుల వివరణ కోరగా ప్రజల నుంచి తమకు ఎటువంటి ఫిర్యాదులు రాలేదని తెలిపారు.

అప్రమత్తతే ఆరోగ్యానికి రక్ష

- సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం
- వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా కొమరాడ మండలం మార్కొండపుట్టి గ్రామంలో దోమల నివారణపై అవగాహన కల్పిస్తున్న డీఎంఓ డాక్టర్ టి.జగన్మోహనరావు

గుమ్మలక్ష్మీపురం: వర్షాకాలం ఆరంభమైంది. వాతావరణంలో మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు విజృంభించే ప్రమాదం ఉంది. వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే తప్పనిసరిగా ఆరోగ్య జాగ్రత్తలు పాటించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ముఖ్యంగా మురుగునీరు, వర్షం నీరు ఇంటి పరిసరాల్లో నిలవకుండా చూసుకోవాలి. లేదంటే దోమలు విజృంభించి మలేరియా, డెంగీ వంటి ప్రాణాంతక వ్యాధులు వ్యాప్తి చేసే ప్రమాదం ఉంది. అడపాదపడా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం, తాగునీటి ట్యాంకుల శుభ్రత, తాగునీటి క్లోరినేషన్, దోమల నివారణ, తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారించారు. అలాగే ఈ నెల 1 నుంచి 30వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో మలేరియా నివారణ మాసోత్సవాలు నిర్వహిస్తోంది. వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రతి రోజూ వివిధ గ్రామాలను సందర్శించి మలేరియా వ్యాధి వ్యాప్తి-నివారణ చర్యలను వివరిస్తూ ప్రజలను చైతన్యం చేస్తున్నారు. దోమల ద్వారా సంక్రమించే వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నారు.

దోమ కాటుతో మలేరియా వ్యాప్తి

మలేరియా అనేది ప్లాస్మోడియం అనే పరాన్నజీవి వల్ల సంభవించే వ్యాధి. ఆడ అనాఫిలస్ దోమల కాటు ద్వారా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. దోమ మనిషిని కుట్టినపుడు వ్యాధికారక క్రిములు శరీరంలోకి ప్రవేశించి వ్యాధిని కలుగజేస్తుంది. చలి జ్వరం, వాంతులు, ఒంటి నొప్పులు, వంటి లక్షణాలు కనిపిస్తాయి. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించి అవసరమైన పరీక్షలు చేయించుకోని సరైన చికిత్స తీసుకోవాలి. నిర్లక్ష్యం వహిస్తే వ్యాధి తీవ్రత పెరిగితే మెదడు, మూత్రపిండాలు, కాలేయం దెబ్బతింటాయి. ఒక్కోసారి రోగి ప్రాణాలకే ముప్పువాటిల్లే ప్రమాదం ఉంది.



రెల్ల గ్రామంలో దోమల నివారణ కోసం ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

అవగాహనతోనే వ్యాధుల నివారణ

వ్యాధుల బారినపడి అవస్థలు తెచ్చుకునే కంటే ముందస్తుగా నివారణ మార్గాలు అనుసరించడం మేలు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. దోమలు కుట్టకుండా దోమతెరలు వినియోగించాలి. అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించి సరైన చికిత్స తీసుకోవాలి.
– టి.జగన్మోహనరావు, జిల్లా మలేరియా అధికారి

ప్రిజమ్ - 10 అమలు చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ కిశోర్‌కుమార్

భామిని: కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రిజమ్ -10 కచ్చితంగా అమలు చేయాల్సిందేనని ఎంపీడీఓ పి.కిశోర్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తహీనత గల గర్భిణులకు ఎటువంటి చికిత్స అందించాలి.. సుఖ ప్రసవాలు జరిగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎ.శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సందీప్, వైద్యాధికారులు పి.సోయల్, కె.రవీంద్ర, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

విద్యా ప్రవేశం కార్యక్రమం విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఎంఈఓ సింహాచలం

పార్వతీపురంటౌన్: నూతన విద్యా సంవత్సరంలో మండలంలోని పాఠశాలల్లో విద్యా ప్రవేశం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల విద్యాశాఖాధికారి 1 సామల సింహాచలం అన్నారు. ఈ మేరకు సోమవారం పార్వతీపురం మండలం, మున్సిపాలిటీ పరిధిలోని అన్ని యాజమాన్య ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంఈఓ 1 సామల సింహాచలం మాట్లాడుతూ విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో పాఠశాల స్థాయిలో నెల రోజుల పాటు విద్యా ప్రవేశం కార్యక్రమం నిర్వహించాలన్నారు. విద్యార్థుల్లో విద్యాప్రమాణాలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. స్టూడెంట్‌కిట్స్‌ను ప్రతి విద్యార్థికి పంపిణీ చేయాలని, ఉపాధ్యాయులందరూ సమయ పాలన పాటించాలని, ఫేషియల్ అటెండెన్స్ తప్పని సరిగా వేయాలని స్పష్టం చేశారు.

విద్యాశాఖలో అమలు చేస్తున్న వివిధ పథకాలు, కార్యక్రమాల పేర్లను మార్పు చేశారని, వాటన్నిటినీ గమనించి నూతన పేర్లను వినియోగించాలని ఆదేశించారు. రిజిస్టర్స్, రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, పాఠశాల పరిసరాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

- డీఆర్‌డీఏ పీడీ సత్యంనాయుడు



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సత్యంనాయుడు

వీరఘట్టం : ఇటీవల కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హెల్త్ సిబ్బంది, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డయేరియా ప్రబలకుండా మంచినీటి బావులు, బోర్లు, రక్షిత పథకాల్లో క్లోరినేషన్ చేయించాలని సూచించారు. అలాగే వైద్య సిబ్బంది పంచాయతీల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ ఎంవీబీ సుబ్రహ్మణ్యం, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీవల్లిక, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలు పారదర్శకంగా నిర్వహించాలి

గరుగుబిల్లి: ఉపాధిహామీ పథకం కింద 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు మండలంలో నిర్వహించిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీలు చేపట్టనున్నట్లు స్టేట్ రిసోర్సు పర్సన్ బి.దాసు తెలిపారు.

ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం 18వ విడత సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డీఆర్‌పీలతో పాటు గ్రామస్థాయి కార్యకర్తలు గ్రామాల్లో జరిగిన పనులకు సంబంధించి తనిఖీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. సామాజిక తనిఖీలకు ఏడుగురు డీఆర్‌పీలతో పాటు 25 నుంచి 30 వరకు గ్రామస్థాయి సామాజిక తనిఖీ కార్యకర్తలను నియమించినట్లు తెలిపారు. పంచాయతీల్లో ఉపాధి నిధులు రూ.16.62 కోట్లతో చేపట్టిన పనులతో పాటు సామాజిక పింఛన్లను తనిఖీలు చేయనున్నట్లు చెప్పారు. అలాగే రూ.2.54కోట్లతో నిర్మించిన సచివాలయ భవనాలు, మెటీరియల్‌కు సంబంధించి తనిఖీలు చేపట్టడం జరుగుతుందన్నారు. నివేదికలను జూలై 9న ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ప్రజావేదికలో వెల్లడించనున్నట్లు వివరించారు.

పలుచోట్ల చిరుజల్లులు



గుమ్మలక్ష్మీపురంలో కురుస్తున్న వర్షం



కొమరాడ: విక్రంపురంలో కురుస్తున్న వర్షం

గుమ్మలక్ష్మీపురం:

గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో ఎట్టకేలకు సోమవారం సాయంత్రం వర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా పగటి పూట అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో ప్రజలు ఉక్కపోతతో అల్లాడుతున్నారు. ప్రతిరోజు సాయంత్రం ఆకాశంలో మబ్బులు దోబూచులాడుతూ ప్రజలను ఊరించేవి. కానీ వర్షం కురిసేది కాదు. సోమవారం సాయంత్రం సుమారు గంట సేపు కురిసిన వర్షంతో వాతావరణం కాస్త చల్లబడింది. ఉక్కపోత నుంచి ప్రజలకు ఉపశమనం లభించింది. దుక్కులు చేపట్టి విత్తనాలు విత్తేందుకు ఎదురు చూస్తున్న రైతులకు ఈ వర్షం ఉపయోగకరంగా ఉంటుంది.

- జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి, వెంకటరాజపురం, గవరమ్మపేట, బిత్రపాడు, బాసంగి, బట్లభద్ర, కన్నపుదొరవలస గ్రామాల్లో సోమవారం సాయంత్రం వర్షం కురిసింది. వరి నారుమడులు, వెద పొలాలకు ఈ వర్షంతో ప్రాణం పోసినట్లయిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.
- గరుగుబిల్లి: మండలంలోని గరుగుబిల్లి, గొట్టివలస, పెద్దూరు తదితర గ్రామాల్లో సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులుతో కూడిన వర్షం కురిసింది. గొట్టివలసలో ఓ చెట్టుపై పిడుగు పడింది. సమీపంలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి నష్టం సంభవించలేదు. ఈదురుగాలుల కారణంగా పలుచోట్ల విద్యుత్ వైర్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.
- కొమరాడ: మండల పరిధిలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఖరీఫ్ వ్యవసాయ పనులకు ఈ వర్షం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వరి, పత్తి, కురగాయలు సాగు రైతులు విత్తనాలు విత్తుకునేందుకు సిద్ధమవుతున్నారు.

సీతంపేటలో 'నేను బడికిపోతా' ర్యాలీ

సీతంపేట: మండల కేంద్రంలో 'నేను బడికిపోతా' కార్యక్రమంలో భాగంగా సోమవారం ర్యాలీ నిర్వహించారు. గిరిజన సంక్షేమ శాఖ డీడీ అన్నదొర, డిప్యూటీ ఈఓ పి.నారాయుడు ఆధ్వర్యంలో స్థానిక బాలుర ఆశ్రమ పాఠశాల నుంచి దోనుబాయి జంక్షన్ వరకు విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు. ఆరు నుంచి 16 సంవత్సరాల పిల్లలు ప్రతిఒక్కరూ పాఠశాలలోనే ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంఓ కోటిబాబు, సీఎంఓ చిరంజీవులు, ఎంఈఓ సూర్యచంద్రరావు, హెచ్‌ఎం పద్మశ్రీ పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది

● పింఛన్ ఇచ్చి ఆదుకోండి..

పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని మండలంలోని చాకలిగూడకు చెందిన సవర సరోజిని కోరారు. ఈ మేరకు దివ్యాంగుడైన తన కుమారుడితో సోమవారం స్థానిక ఐటీడీఏకు వచ్చి అధికారులను కలిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తనకు ముగ్గురు సంతానమని, రెండో కుమారుడు దుర్గారావుకు కాళ్లు, చేతులు పనిచేయకపోవడంతో మంచానికే పరిమితమయ్యాడని ఆవేదన వ్యక్తం చేసింది. కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నామని, అధికారులు స్పందించి తమ కుమారుడికి పింఛన్ మంజూరు చేయాలని కోరారు. –సీతంపేట



ఐటీడీఏ వద్ద కుమారుడితో ఉన్న సరోజిని

సమస్యల పరిష్కారానికి చర్యలు

పాలకొండ : ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో భాగంగా అర్జీదారులు తెలియజేసిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వరహాలు అన్నారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వ్యక్తిగత, సామాజిక సమస్యలపై అర్జీలు అందజేశారు. ప్రధానంగా తోటపల్లి ఎడమ కాలువ ద్వారా సాగు నీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. ఇళ్ల స్థలాలకు పొజిషన్ పత్రాలు అందించాలని పలువురు మహిళలు కోరారు.



వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ వరహాలు

కార్యకర్తలకు అందుబాటులో ఉంటాం..

భామిని: ఎన్నికల్లో ఓటమి చెందినందుకు కార్యకర్తలు డీలా పడవద్దని, ప్రతి ఓటమీ విజయానికి తొలి మెట్టుగా భావించాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు అన్నారు. మండల కేంద్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కార్యకర్తలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు అగతముడి రఘు, గెల్లంకి రమేష్, సర్పంచ్‌లు తొగరాన శ్రీను, నిమ్మల కేశవ, తమ్మారావు, లజ్జాయి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రయాణికుల జీవితాలతో చెలగాటం వద్దు

- ఏఆర్‌టీఓ కుమార్

భామిని : ప్రయాణికుల జీవితాలతో చెలగాటం ఆడవద్దని ఏఆర్‌టీఓ జీఎస్ఎస్ఆర్‌కే కుమార్, ఆర్టీసీ డిపో మేనేజర్ టి. వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని బత్తిలిలో సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని సూచించారు. వాహనాలకు ఫిట్‌నెస్‌పరీక్షలు చేయించాలన్నారు. నిబంధనలు పాటించని కొంతమందికి అపరాధ రుసుం విధించారు.



బత్తిలి సమీపంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ఏఆర్‌టీఓ కుమార్, డీఎం వెంకటేశ్వరరావు

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం..

కొమరాడ: మండల పరిషత్ అధ్యక్షురాలు(ఎంపీపీ) శెట్టి శ్యామల భర్త డాక్టర్ శెట్టి మధుసూదనరావు శనివారం గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన అంత్యక్రియలను మాదలింగి గ్రామంలో ఆదివారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు ఆయన అంత్యక్రియల్లో పాల్గొని సంతాపం వ్యక్తం చేశారు. ఎంపీపీ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కుటుంబానికి పార్టీ పరంగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వారి వెంట గుమ్మలక్ష్మీపురం ఎంపీపీ దీనమయ్య, తొడము సర్పంచ్ యేగిరెడ్డి సింహాచలం, తదితరులు ఉన్నారు.



ఎంపీపీ శామ్యలను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

హెల్త్ వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి..

సీతంపేట: ఆదివాసీ ఆరోగ్యం పేరిట గతంలో ఆశ్రమ పాఠశాలలు, పోస్టుమెట్రిక్, జెడ్‌పీహెచ్ పాఠశాలల్లో పనిచేసిన హెల్త్ వలంటీర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని పలువురు కోరారు. ఈ మేరకు ఐటీడీఏ ఏపీఓను సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ, థర్డ్ పార్టీ నిబంధనల ప్రకారం 2019 నుంచి తమను తొలగించారన్నారు. మళ్లీ తమకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వసతిగృహాలు, స్కూళ్ల ఆరోగ్య కార్యకర్తల రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహనరావు, సంతోష్, లక్ష్మీకాంతం, అరుణ, తదితరులున్నారు.



ఐటీడీఏ ఏపీఓకు వినతిపత్రం ఇస్తున్న హెల్త్ వలంటీర్లు

డోకులగూడలో తాగునీటి ఇక్కట్లు


భామిని: మండలంలోని డోకులగూడ ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసినా నీరు అందడం లేదని ప్రజలు వాపోతున్నారు. ప్రజల ఇబ్బందులు గమనించిన నల్లరాయిగూడ సర్పంచ్ బిడ్డిక గయామీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు బిడ్డిక ప్రసాద్ ట్రాక్టర్లపై ట్యాంక్‌లు ఏర్పాటు చేసి తాగునీరు సరఫరా చేస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ట్యాంకర్ వద్ద నీరు పట్టుకుంటున్న గిరిజన మహిళలు

ప్రతి గ్రామంలో శానిటేషన్ డ్రైవ్

పాలకొండ రూరల్: మండలంలోని ప్రతి గ్రామంలో విధిగా శానిటేషన్ డ్రైవ్ నిర్వహించి, పనులు చేపట్టాలని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టడంతో పాటు వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రవళిక, కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ, ఏఈ ప్రవళిక

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

గరుగుబిల్లి: జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశాల మేరకు రహదారి ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. పార్వతీపురం ఆర్టీసీ డిపో మేనేజర్ కె.దుర్గ, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.కాశీరాం నాయక్ ఆధ్వర్యంలో మండలంలోని ఖడ్గవలస, ఎర్రన్నగుడి జంక్షన్ వద్ద సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. రోడ్డు భద్రత నిబంధనలపై వాహన చోదకులకు అవగాహన కల్పించారు. నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి ప్రయాణికులను తీసుకువెళ్తున్న వాహనాలపై కేసులు నమోదు చేయడంతో పాటు అపరాధ రుసుం విధించడం జరుగుతుందన్నారు. మోటార్ వాహనం చట్టంపై డ్రైవర్లు అవగాహన కలిగివుండాలన్నారు.



ఎర్రన్నగుడి పరిసరాల్లో వాహనాలు తనిఖీలు చేస్తున్న ఎంవీఐ కాశీరాంనాయక్